# సర్కారు పాఠశాలల్లో సకల సౌకర్యాలు

- సీఎం అల్పాహార పథకంతో రాష్ట్రంలో 20లక్షల మందికి లబ్ధి
- ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి తాళ్లపూసపల్లి ఉన్నత పాఠశాలలో అల్పహార పథకం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత, చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, అక్టోబర్ 6 : పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని మహబూబాబాద్ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని ఆమె ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ సర్కారు రాష్ట్రంలో గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. మండలానికి రెండు, మూడు గురుకులాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచి, సుచికరమైన భోజనాన్ని అందించేందుకు మధ్యాహ్నం భోజనాన్ని సన్నబియ్యంతో అందిస్తున్నట్లు తెలిపారు. 'మన ఊరు – మన బడి' కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలతో సర్కారు పాఠశాలల్లో అధునాతన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుండడంతో ఎక్కువ మంది విద్యార్థులు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండి సకాలంలో భోజనం అందించకపోతే విద్యార్థులు ఆకలితో ఉండకూడదనే సీఎం కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపా రు. దీని ద్వారా రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కలుగుతున్నదన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువు ఎవరి సొ త్తు కాదని, చదువుతోనే పేదరికాన్ని జయించవచ్చని సూ చించారు. విద్యార్థులు, యువత కోసం గ్రామాల్లో క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేసి, స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటాయని, ఆరోగ్యంగా కూడా ఉంటారని తెలిపారు.

### క్రమశిక్షణను అలవర్చుకోవాలి
**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో.., ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కూడా అంతే బాధ్యత ఉందన్నారు. సెల్‌ఫోన్‌లో ప్రపంచం ఉందని, సెల్‌ఫోన్‌ను ద్వారా మంచిని సేకరించిన వారు మాత్రమే ఉన్నత లక్ష్యాన్ని చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాల్లోని సారాంశాన్ని గ్రహించి సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే అల్పాహారం, సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నదన్నారు.

### విద్యకు అధిక ప్రాధాన్యం
**ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్**

సీఎం కేసీఆర్ ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆసరా, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. మంత్రి కేటీఆర్ వేల సంఖ్యలో ఐటీ కంపెనీలను తీసుకురావడంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. నూతన జిల్లాల్లో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతో అనేకమంది విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కలిగిందన్నారు. త్రిమూర్తులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతున్నదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం, అధునాతన సౌకర్యాలు, స్పోర్ట్స్ కిట్లు, అల్పాహారం వంటి కార్యక్రమాలు ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి, రాష్ట్రానికి, దేశానికి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ డేవిడ్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల రవిచందర్‌రెడ్డి, నీలం దుర్గేశ్, సింగిల్ విండో డైరెక్టర్ సారంపల్లి మోహన్‌రెడ్డి, సీడీపీవో డెబోరా, నోడల్ ప్రధానోపాధ్యాయులు కొత్త జగన్మోహన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.



మరిపెడలో మాట్లాడుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

## సీఎం కేసీఆర్ అల్పాహారం బడిపిల్లలకు వరం

- బలమైన ఆహారంతో విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత
- దేశానికే ఆదర్శం ఈ పథకం
- మరిపెడలో ప్రారంభించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, అక్టోబర్ 6 : గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు 'సీఎం కేసీఆర్ అల్పాహార' పథకాన్ని ప్రారంభించిందని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి టిఫిన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు – మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది మెరుగైన బోధన అందిస్తున్న సీఎంకేసీఆర్ మరో అడుగుముందుకేసి బడిపిల్లలకు అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు గుడ్లతో పౌష్టికాహారం, ఉదయం ఇడ్లీ, పూరి, ఉప్మా, రాగిజావ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. బలమైన ఆహారం తీసుకున్న విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను సాధిస్తారని అన్నారు. దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పాలకులకు ఇలాంటి ఆలోచన ఏనాడు రాలేదన్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం యావత్ దేశానికే ఆదర్శమన్నారు. అనంతరం రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర అందజేసిన వ్యాయామ దుస్తులను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, కమిషనర్ రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో కేలోత్ ధన్‌సింగ్, కౌన్సిలర్లు పరశురాములు, పానుగోత్ సుజాత వెంకన్న, మక్సూద్, జిల్లా మైనార్టీ నాయకులు ఆయూబ్ పాషా, సయ్యాద్ లతీఫ్, జనార్దన్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'స్వీప్'తో సత్ఫలితాలు

**ఓటు హక్కు నమోదు శాతం పెరిగింది: కలెక్టర్**

మహబూబాబాద్, అక్టోబర్ 6 : స్వీప్ కార్యక్రమంతో ఓటు హక్కు నమోదు శాతం పెరిగిందని కలెక్టర్ కే శశాంక తెలిపారు. శుక్రవారం ఐడీవోసీలోని కలెక్టరేట్‌లో ఓటర్ల చైతన్యానికి చేపట్టిన స్వీప్ డాక్యుమెంటరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువత ఓటరు నమోదుకు చేపట్టిన స్వీప్ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. యువతలో చైతన్యం పెరిగి అత్యధికంగా ఓటు నమోదు చేయించుకున్నారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతను లక్ష్యంగా చేసుకుని కళాశాలలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతి గృహాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు విశిష్టతను తెలియజేయడంతో యువత ఓటు నమోదు చేయించుకునేందుకు ఆసక్తి చూపారని అన్నారు. జిల్లాలో 4889గా ఉన్న యువత ఓట్లు 15,803కు చేరాయన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, స్వీప్ నోడల్ అధికారి, డీఆర్డీవో సన్యాసయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టహాసంగా కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

- హాజరైన సినీ తార మెహరీన్ ఫిర్జాద
- పాల్గొన్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్



జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న నటి మెహరీన్ ఫిర్జాద



అభిమానులకు అభివాదం చేస్తున్న నటి మెహరీన్ ఫిర్జాద

మహబూబాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ పట్టణంలోని స్టేషన్ రోడ్‌లో కాసం ఫ్యాషన్స్ రెడీమేడ్ షో రూంను సినీ నటి మెహరీన్ ఫిర్జాద శుక్రవారం ఉదయం ప్రారంభించారు. అతిపెద్ద ప్రాంగణంలో కాసం ఫ్యాషన్స్ షోరూం ఏర్పాటు చేశారని, అన్ని వయసుల వారికి నాణ్యతతో కూడిన రెడీమేడ్ వస్త్రాలు, మహిళలకు చీరెలు సరసమైన ధరలకు ఇక్కడ లభిస్తాయని సినీ నటి మెహరీన్ తెలిపారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు నాణ్యమైన లేటెస్ట్ రెడీమేడ్ వస్త్రాల కోసం హైదరాబాద్, విజయవాడ వంటి సుదూర పట్టణాలకు వెళ్లేవారని, ఇప్పుడు మహబూబాబాద్‌లో కాసం ఫ్యాషన్స్ ఏర్పాటు చేయడంతో ఆ సమస్య తీరిందని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మి అన్నారు. హీరోయిన్ మెహ్రీన్ ఫిర్జాదతోపాటు డాక్టర్ సీతామహాలక్ష్మి షోరూమ్‌ను ప్రారంభించారు. మహబూబాబాద్‌లో ఏర్పా టు చేసిన కాసం ఫ్యాషన్స్ 8వ షోరూం అని కాసం మల్లికార్జున్, కాసం నమఃశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పనీత్, సాయి కృష్ణ తెలిపారు. త్వరలో పాల్వంచలో తమ తొమ్మిదో షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు అరుణ్, వరుణ్, విశాల్, ఎంసాని, ప్రవీణ్, తోడుపునూరి కార్తీక్, అరుణ్ పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జడ్పీచైర్‌పర్సన్ బిందుతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినీనటి మెహ్రీన్ చూసేందుకు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.